క్లుప్తంగా

వీధి కుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకాలు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంతో పాటు ఎల్విన్‌పేట గ్రామ పంచాయతీల్లో శనివారం వీధి కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్లు వేశారు. ఈ మేరకు గ్రామాల్లో వీధి కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజల్ని భయాందోళనలకు గురి చేస్తున్నాయని, కొన్ని సందర్భాల్లో దాడులకు పాల్పడుతున్నాయని ఈ నేపథ్యంలోనే అధికారుల సాయంతో వీధి కుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకాలు వేయిస్తున్నట్టు సర్పంచ్‌లు బి.గౌరీశంకరరావు, ఆర్ఎస్ చైతన్య స్రవంతి పేర్కొన్నారు.

డ్రోన్‌తో పురుగుల మందు పిచికారీ



పంట పొలంలో డ్రోన్‌తో పురుగుల మందు పిచికారీ

గరుగుబిల్లి: ఖరీఫ్ వరి పంటలో డ్రోన్‌తో ఎరువులు, పురగు మందులు పిచికారీ చేయడం వల్ల పొలమంతా ఒకేలా పిచికారీ జరగడంతో పాటు వ్యయం కూడా ఎంతో ఆదా అవుతుందని ఏవో టి.జ్యోత్స్న అన్నారు. మండలంలోని రాయిందొరవలస గ్రామంలో పెదగుడబ ఆర్ఎస్‌కే పరిధిలో పంట పొలంలో డ్రోన్‌తో పురుగుల మందును పిచికారీ శనివారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ విధానాలను ఆచరించి సాంప్రదాయ పద్ధ

వరద గట్టు నిర్మించాలి



వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

భామిని: వంశధార వరదల్లో తీవ్రంగా నష్టపోయిన కీసర, కోసలి, ఘనసర గ్రామాలకు రక్షణ కల్పించే వరద గట్టు నిర్మించి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. మండల పార్టీ కార్యదర్శి కొప్పల మిన్నారావుతో కలిసి వరద నష్టం జరిగిన ప్రాంతాలను శనివారం పరిశీలించి నష్టాలను గుర్తించారు. ప్రభుత్వం తక్షణమే పంటలు పోగొట్టుకొన్న రైతులకు నష్ట పరిహారం అందివ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు కె.ప్రసాద్, పి.ఆయూబ్, రైతులున్నారు.

తుప్పలతో ప్రయాణికులకు తిప్పలు



తాడికొండ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన తుప్పలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఇరిడి జంక్షన్ నుంచి తాడికొండ గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తిప్పలు పడుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో ఏపుగా పెరిగిన తుప్పలు రోడ్డుపైకి వ్యాపించడంతో ఆయా ప్రదేశాలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన తుప్పలను తొలగించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

బలిజిపేట: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాగమణి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. వివిధ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులతో రివ్యూ నిర్వహించారు. వ్యవసాయశాఖ ఏఓ శివగణేష్ మాట్లాడుతూ ఈ క్రాప్ 20వేల ఎకరాలకు చేయాల్సి ఉండగా ఇప్పటికి 10వేల ఎకరాలకు మాత్రమే పూర్తయిందన్నారు. ఈనెల 25వ తేదీ లోపల పూర్తిచేయించుకోవాలని కోరారు. రైతులు ముందుకు వచ్చి త్వరగా చేయించుకోవాలని చెప్పారు. అన్నదాత సుఖీభవ మండలంలో 8వేల మంది రైతులకు వచ్చిందన్నారు. యూరియాపై జెడ్పీటీసీ రవికుమార్ ప్రశ్నించగా 1450 ఎం.టి అవసరం కాగా మండలానికి 1600ఎం.టి వచ్చిందన్నారు. అజ్జాడలో 800 బస్తాలు ఇవ్వాల్సిన అవసరం ఏమిటని, అంతకంటే పెద్దగ్రామాలు ఉన్నప్పటికీ అక్కడి రైతులకు సక్రమంగా అందలేదని ఎందుకలా చేశారని జెడ్పీటీసీ ప్రశ్నించగా అక్కడ అవసరం అయినందున ఇచ్చామని ఏఓ శివగణేష్ తెలిపారు. ఉపాధిహామీ పథకానికి సంబంధించి ఏపీఓ కేశవరావు మాట్లాడుతూ జాబ్‌కార్డులు కలిగిన ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. మండలంలో రూ.4 కోట్ల విలువ కలిగిన పనులు చేయగా ఒక రూ.కోటి మాత్రమే వచ్చిందని ఇంకా రూ.3కోట్లు బకాయిలు ఉన్నాయని అవి రావాల్సి ఉందన్నారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల సమాచారాన్ని సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీవాణి, జెడ్పీటీసీ రవికుమార్, ఉపాధ్యక్షుడు సాయిరాం, మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారంపై

అనుమానాలు!

- ప్రశ్నార్థకంగా మారిన పంట నష్టపోయిన రైతుల పరిస్థితి
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో పంట నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం
- ప్రస్తుతం నోటిఫైడ్ తుఫాన్‌లకు జరిగిన పంట నష్టానికి మాత్రమే పరిహారం వస్తుందంటున్న యంత్రాంగం



వీరఘట్టం మండలం చిట్టపులివలసలో ఈ నెల 2న ఈదురుగాలులకు నేలమట్టమైన అరటి తోట

వీరఘట్టం:

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రకృతి వైపరీత్యాలు, ఈదురుగాలులు, అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను అక్కున చేర్చుకుని, పంట నష్టపోయిన ప్రతీ రైతుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిహారాన్ని అందజేశారు. రైతుల తరపున వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే బీమా చెల్లించి రైతులకు అండగా నిలిచింది. అయితే నేటి కూటమి ప్రభుత్వం పంటల బీమాకు రైతులే డబ్బులు చెల్లించుకోవాలని మెలిక పెట్టింది. బీమా కట్టకపోతే పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం వస్తుందా.. అంటే అధికారులు బదులు చెప్పలేకపోతున్నారు. దసరా పర్వదినం రోజున భారీగా వీచిన ఈదురుగాలులకు జిల్లా వ్యాప్తంగా ప్రధానంగా అరటి పంటకు నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమిక నిర్ధారణ చేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 6250 ఎకరాల్లో అరటి పంటకు నష్టం జరిగినట్టు ఉద్యానవన శాఖ అధికారులు గుర్తించారు. పంటల నష్టం నివేదికను సిద్ధం చేస్తున్నారు.

పరిహారం చెల్లించేందుకు మెలిక

సాధారంగా వాతావరణ శాఖ గుర్తించిన తుఫాన్‌లలో జరిగిన పంట నష్టానికి మాత్రమే ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుంది. ఉదాహరణకు గతంలో వచ్చిన హుదూద్, తిత్లీ ఇటువంటి తుఫాన్‌లలో పంటలకు జరిగిన నష్టంకు ప్రభుత్వం పరిహారం చెల్లించింది. ప్రస్తుతం ఈ నెల 2న వచ్చిన తుఫాన్‌ను ప్రభుత్వం గుర్తించలేదు. దీనికి ఎటువంటి నామకరణం కూడా చేయలేదు. దీంతో దసరా రోజు వచ్చిన తుఫాన్ కారణంగా జరిగిన పంటల నష్టానికి పరిహారం వస్తుందా? అంటే ఈ విషయం ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు మాత్రం పంటల నష్టాన్ని లెక్కిస్తున్నారు. ప్రభుత్వం దయ చూపితే పరిహారం వస్తుందని, లేదంటే ఏం చేయలేమని అధికారులు చెబుతున్నారు.

6250 ఎకరాల్లో అరటి పంటకు నష్టం

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 2న వీచిన ఈదురుగాలులు, కురిసిన వర్షాలకు సుమారు 6250 ఎకరాల్లో అరటి పంటకు నష్టం జరిగింది. మా అధికారుల బృందం పంట పొలాలకు వెళ్లి పంటలు నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేస్తున్నారు. అత్యధికంగా వీరఘట్టం మండలంలో అరటి పంట నేలమట్టమైనట్టు గుర్తించాం. పంటల బీమా ఉన్న వారికి పరిహారం తప్పకుండా వస్తుంది. అయితే సాధారణ తుఫాన్‌లలో జరిగిన పంటల నష్టానికి పంటల బీమా లేని వారికి పరిహారం వస్తుందో.. లేదో.. చెప్పలేం. పంట నష్టం నివేదికను మూడు రోజుల్లో సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేస్తాం.

– సత్యన్నారాయణరెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి, పార్వతీపురం మన్యం

నేడు స్వామివారికి శ్రీచక్ర స్నానం



పవిత్ర మాలికలతో అలంకరించిన శ్రీవేంకటేశ్వరస్వామి

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలను, అర్చనలను నిర్వహించారు. ఈ మేరకు స్వామి వారిని పవిత్ర మాలికలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం సుప్రభాతసేవ, అంకురారోపణ, కల్యాణ మండప పూజ తదితర పూజలను నిర్వహించిన అనంతరం స్వామివారికి తిరువీధి కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు శ్రీ చక్రస్నానం

పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం పవిత్ర నాగావళి నది తీరంలో పద్మావతి సహిత శ్రీవేంకటేశ్వర స్వామి వారికి శ్రీచక్ర స్నానం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధికంగా పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

200 రోజుల పని దినాలు కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం: గిరిజనులకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 200 రోజుల పని దినాలు కల్పించాలని గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.సన్యాసిరావు డిమాండ్ చేశారు. లుంబేసు గ్రామ సచివాలయం వద్ద శనివారం గ్రామ సభను డిజిటల్ అసిస్టెంట్ రామచంద్రారావు, పంచాయతీ సర్పంచ్ టి.చిలకమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఎం.గౌరమ్మ తదితరులు నిర్వహించారు. పంచాయతీలో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానాలు చేశారు. సభలో పాల్గొన్న గిరిజన సంఘం అధ్యక్షుడు సన్యాసిరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్‌కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికి 200 రోజుల పని దినాలు కల్పించాలని, రోజువారీ కూలి రూ.600 గిట్టుబాటు అయ్యేలా చూడాలని, పని చేసే కూలీలకు పారా, గునపం, తట్ట వంటి పరికరాలను అందజేయాలని, పనులకు సంబంధించిన వేతనాన్ని 14 రోజుల్లోనే అందజేసేలా చర్యలు తీసుకునేలా తీర్మానం చేసి ఉన్నతాధికారులకు నివేదికను సమర్పించాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్ జమ్మయ్య తదితరులు ఉన్నారు.

మాజీ ఉప ముఖ్యమంత్రి పరామర్శ



రావికర్రవలసలో వర్షత శ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ: మండలంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి శనివారం పరామర్శించారు. కుమ్మరిగుంట పంచాయతీ రావికర్రవలస గ్రామానికి చెందిన ఉడతల గవరయ్య కుమార్తె వర్షతశ్రీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. వారి కుటుంబసభ్యులకు పరామర్శించి ఓదార్చారు. కళ్లికోట గ్రామానికి చెందిన శీర సత్యంనాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులనూ పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గుణానపురం గ్రామానికి చెందిన తట్టికోట పార్వతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులనూ పుష్పశ్రీవాణి ఓదార్చారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కళింగి మల్లేశ్వరరావు, జిల్లా యూత్ అధ్యక్షుడు నంగిరెడ్డి శరత్‌బాబు, కెంగువ పోలినాయుడు, కొల్లు సింహాచలం, దాసరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల రక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో

భామిని: మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం ఐసీడీఎస్ సీడీపీవో జి.శాంతి భవానీ ఆధ్వర్యంలో బాలల రక్షణ మరియు సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ, మహిళా శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణలో బాలల రక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రధానంగా బాల్య వివాహాలు నివారణతో పాటు బాలల హక్కుల పరిరక్షణ చేపట్టాలన్నారు. బాల్య వివాహాలకు పడే శిక్షలు వివరించారు. బాలల పరిరక్షణ లీగల్ ఆఫీసర్ పి.శ్రీధర్ మాట్లాడుతూ బాలల రక్షణకు తెచ్చిన పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ఎస్‌వోలు సుధావాణి, జ్యోతి లక్ష్మి, సబితా పట్నాయిక్, సర్పంచ్‌లు, కార్యదర్శులు, వీఆర్‌వోలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రయోజనం



జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల నిత్యవసర వస్తువుల ధరలపై ఉన్న జీఎస్టీని తగ్గించటం వినియోగదారులకు ప్రయోజనకరమని వాణిజ్య విభాగం డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బి.జ్ఞానప్రసూనాంబ అన్నారు. స్థానిక ఎంఈవో సమావేశ మందిరంలో పట్టణ పరిధిలోని వర్తక, వాణిజ్య రంగాలకు చెందిన వ్యాపారులకు అవగాహన కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా తగ్గిన జీఎస్టీల వివరాలు, ప్రస్తుత ధర అదితర అంశాలపై అవగాహన కల్పించారు. వ్యాపారులు ఈ విషయం గుర్తించి వినియోగదారులకు తాజా ధరలకు విక్రయాలు చేపట్టాలన్నారు. సమావేశంలో గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ అధికారులు డి.శ్రీనివాసరావు, తిరుపతిరావు, ఆప్కో అధికారులు పాల్గొన్నారు.

వృత్తి విద్యపై ఆసక్తి

భామిని: వృత్తి విద్యపై ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఆసక్తి చూపి ప్రగతి సాధిస్తున్నారని ప్రిన్సిపాల్ బాబూరావు శనివారం తెలిపారు. దసరా సెలవుల్లో ఒకేషనల్ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా వివిధ రకాల వృత్తి విద్యా మెలకువలు నేర్చుకున్నారని పేర్కొన్నారు. జిల్లా బాలికల అభివృద్ధి అధికారి సూచనల మేరకు ఒకేషనల్ ట్రైనర్స్ హరిప్రసాద్, మాధవి, రాంబాబు సూచనల మేరకు మరింత ప్రగతి సాధించారని వివరించారు.

ఆటో ర్యాలీ ప్రారంభించిన సబ్‌కలెక్టర్

పాలకొండ: ఆటో డ్రైవర్లు ప్రభుత్వం అందించిన సాయం సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. శనివారం కోట దుర్గమ్మ ఆలయం వద్ద నుంచి ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రారంభించారు.

వాతావరణ మార్పులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రిసోర్సుపర్సన్

సీతంపేట: వాతావరణ మార్పులు, పంటలపై ప్రభావం అనే అంశంపై మండలంలోని తుంబలి గ్రామంలో శనివారం అవగాహన సదస్సు వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రిసోర్స్‌పర్సన్ పాలక నాగేశ్వరరావు గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ ఉపయోగాలు వివరించారు. అడవి దుంపలు, చిరుధాన్యాలు వినియోగించడం వంటి వాటి గూర్చి తెలియజేశారు. రసాయన మందులకు బదులు సీమాస్త్రం వంటి ప్రకృతి సిద్ధ మందులు వాడకం వంటి లాభాలు తెలియజేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు రామయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

శ్రమదానంతో రహదారి మరమ్మతులు



అంటికొండ రోడ్డు మరమ్మతులు చేస్తున్న గిరిజనులు

సీతంపేట: మండలంలోని అంటికొండ గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా మరమ్మతులకు గురవడంతో ఈ ప్రాంతంలో తిరిగే ఆర్టీసీ బస్సును నిలుపుదల చేశారు. తామంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పలు గ్రామాలకు చెందిన గిరిజనులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. వారపు సంతలకు అటవీ ఉత్పత్తులు తీసుకువెళ్లాలన్నా, విద్యార్థులు కళాశాలలకు వెళ్లి రావాలన్నా... ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో చేసేదేమి లేక చేయి, చేయి కలిపి శ్రమదానంతో రహదారికి మరమ్మతులు చేపట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మ సమస్యలు పట్టించుకోవాలని అంటికొండ పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

- డీపీఎం శ్రావణ్‌కుమార్‌నాయుడు



గుంజరాడలో గిరిజన రైతులు సాగు చేస్తున్న ఏ గ్రేడ్ రకం వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

కురుపాం: రైతులు నూతన వ్యవసాయ పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రబంధకులు ఎం.శ్రావణ్‌కుమార్‌నాయుడు అన్నారు. మండలంలోని గుంజరాడ, కొండబారిడి గ్రామాల్లో గిరిజన రైతులు సాగు చేస్తున్న ఏ గ్రేడ్ రకం వరి సాగును ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల అనుభవాలను తెలుసుకోగా రైతులు మాట్లాడుతూ ఏ గ్రేడ్ రకం వరి సాగు పద్ధతి వలన వరి ప్రధాన పంటతో పాటు అదనపు ఆదాయం పొందాలంటే పొలం గట్లను వెడల్పు చేసుకొని వాటిపైన బంతి, చిక్కుడు, పెసర, కర్రపెండ్లం, సీమదుంపలు, అరటి, మునగ, బొప్పాయి రకాలు వేసుకుంటే ఎకరాలకు పది వేలు రూపాయిల ఆదాయం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో యంగ్ ప్రొఫెసనల్ రవితేజ, ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, మండల తిమోటిక్ లీడ్ గణేష్ చంద్ర, పి.నరేష్, రైతులు పాల్గొన్నారు.

అమ్మవారి అష్టాదశ విగ్రహ తిరువీధి



తిరువీధిలో అమ్మవారి ఉత్సవ విగ్రహాలు

పాలకొండ: పట్టణంలోని నక్కలపేటలో ఉన్న షిర్డీ సాయి సకలదేవతల ఆలయంలో ఏర్పా టుచేసిన అష్టాదశ అమ్మవారి తిరువీధి శనివా రం నిర్వహించారు. అమ్మవారి 18 రూపాలను ఇక్కడ మంటపంలో ఏర్పాటుచేసి గత 12 రో జులుగా విశేష పూజలు నిర్వహించారు. శనివా రం అమ్మవారి విగ్రహాలను తిరువీధి నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం నాగావళి నదిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ప్రమాదంలో సువర్ణముఖి బ్రిడ్జి

- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు
- రాకపోకలు సాగించేందుకు వాహనదారుల ఆందోళన



కోతకు గురైన సువర్ణముఖి నది బ్రిడ్జిపై ప్రమాదకరపు ప్రయాణాలు సాగిస్తున్న దృశ్యం

మక్కువ: స్థానిక సువర్ణముఖి నది బ్రిడ్జి మరమ్మతులకు గురైంది. బ్రిడ్జి రక్షణగోడ ఇరువైపులా కూలిపోవడంతో పాటు, బ్రిడ్జిశ్లాబ్‌పై పెద్ద, పెద్ద గోతులు తయారై, ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. అంతేకుండా బ్రిడ్జికి ఇరువైపులా పెద్ద,పెద్ద గోతులయ్యాయి. ఎగువ నుంచి వరదనీరు నిత్యం బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తుంది. దీంతో గోతుల్లో నీరు చేరడంతో, గోతులు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు బ్రిడ్జి శివారు భాగాన పెద్దగొయ్యి ఏర్పడింది. ఎదురుగా వచ్చిన వాహనాలు తప్పించబోయి, ప్రమాదవశాత్తు జారిపడితే ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొన్నప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ప్రమాదాలు జరగక ముందే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



బ్రిడ్జి మరమ్మతులకు గురవడంతో గోతుల్లో చేరిన వరదనీరు



బ్రిడ్జి శ్లాబ్‌పై గోతులు



కూలిన రక్షణ గోడకు చేయని మరమ్మతులు

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గిరిజన విద్యార్థుల మరణాలు

పార్వతీపురం: గిరిజన విద్యార్థుల మరణాలన్నీ ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జరిగినవేనని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కమిటీ అధ్యక్షుడు తాడంగి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్‌లు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం వారు మాట్లాడుతూ కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేకపోవడానికి ప్రభుత్వాలే కారణమన్నారు. గిరిజన గురుకుల పాఠశాలల పర్యవేక్షణకు జిల్లా, ఐటీడీఏ స్థాయిలో ప్రత్యేకంగా అధికారులు లేరని, ఐటీడీఏ పీఓ, డీడీలే పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు. కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. గిరిజన విద్యార్థులు పదుల సంఖ్యలో మరణిస్తుంటే గిరిజన సంక్షేమశాఖమంత్రి, ఎంఎల్ఏలు ఏం చేస్తున్నారని, గిరిజన సంక్షేమ పాఠశాలలో చనిపోయిన కుటుంబాలకు కనీసం రూ.5 లక్షలు పరిహారం ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం వద్ద డబ్బులు కూడా లేవా? అని ఎద్దేవా చేశారు. విద్యార్థి మరణానికి కారణంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయడం సరికాదని, చర్యలు తీసుకోవాలంటే గిరిజన సంక్షేమ శాఖమంత్రి, ఐటీడీఏ పీఓను, డీడీలను సస్పెండ్ చేయాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ విద్యాసంస్థలలో మాత్రమే ఎందుకు జరుగుతుందో శాస్త్రీయంగా అధ్యయనం చేసి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచకపోతే విద్యార్థులకు పౌష్టికాహారం ఎలా వస్తుందని ప్రశ్నించారు.